

బాధితులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## బాధితులకు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

పెద్దవంగర, అక్టోబర్ 25 : మండల కేంద్రంకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఈదురు వెంకన్న తండ్రి భిక్షం, అలాగే ముద్రబోయిన నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం పాలకుర్తి దేవస్థాన, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ స్థానిక బీఆర్ఎస్ నేతలతో కలిసి మృతులకు నివాళులర్పించి, వారి కుటుంబాలను పరామర్శించారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఏదునూరి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, పీఏసీఎస్ డైరెక్టర్ రవి, యాదవ సంఘం మండల నాయకులు నిమ్మల శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు బక్కమ్మ, సుధీర్‌కుమార్, లింగమూర్తి, రాము, యాకూబ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



ఏఈకి వినతిపత్రం అందిస్తున్న రైతులు

## మైసు కాల్వ ద్వారా నీరందించాలి

గార్ల, అక్టోబర్ 25 : మైసు కాల్వ మరమ్మతు చేయించి పంట పొలాలకు నీరందించాలని రైతు సంఘం జిల్లా నాయకుడు తోడేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ ఏఈకి బుధవారం వినతి పత్రం అందజేశారు. 700 ఎకరాలు పొలాలు ఎండిపోతున్నావని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితులు అనుగుణంగా రైతులకు మైసు కాల్వ ద్వారా నీరందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు తాళ్లపల్లి చంద్రయ్య, ఉప్పలయ్య, వెంకన్న, రమణ, శ్రీను, మురళి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ప్రచార రథాన్ని అడ్డుకున్న వారిపై కేసు నమోదు

తొర్రూరు, అక్టోబర్ 25 : మండలంలోని చీకటాయపాలెం గ్రామంలో కొందరు యువకులు మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. గ్రామంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రచార రథాన్ని డొంక రహీం, సాయికుమార్, యాకూబ్ అడ్డుకుని వాగ్వివాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన ప్రదేశానికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకన్నట్లు సమాచారం. ఈ విషయంపై ఎస్సై జగదీశ్ మాట్లాడారు. ఎన్నికల అధికారుల అనుమతితో గ్రామాల్లోకి వచ్చే ప్రచార రథాలను ఎవరూ అడ్డుకున్న చర్యలు తీసుకుంటామన్నారు. ప్రచార రథం డ్రైవర్ ఎర్ర అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు మరో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ప్రజలు నిర్భయంగా ఓటెయ్యాలి

బచ్చన్నపేట, అక్టోబర్ 25 : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంత వాతావరణంలో నిర్భయంగా ఓటెయ్యాలని జనగామ డీసీపీ సీతారాం కోరారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో బుధవారం మండల కేంద్రంలో పోలీసులు కవాతు నిర్వహించారు. జనగామ డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్‌రెడ్డి నేతృత్వంలో కేంద్ర బలగాలు, ఏఆర్, సివిల్ పోలీసులు పురవీదుల గుండా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సీతారాం మాట్లాడుతూ ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటెయ్యవచ్చని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఇందుకనుగుణంగా పౌరులకు స్వేచ్ఛ ఇచ్చిందన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. సీఐ సాయిరమణ, పలు మండలాల ఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



కవాతు చేస్తున్న పోలీసులు



చిన్నగూడూరు : దుర్గామాత శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న భక్తులు



గార్ల : దుర్గాదేవి నిమజ్జన ర్యాలీ తీస్తున్న భక్తులు

# ఘనంగా దుర్గామాత నిమజ్జనోత్సవం

- కనుల పండువగా శోభాయాత్ర
- ఊరేగింపులో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

కురవి, అక్టోబర్ 25 : కురవి, సీరోలు మండలాల వ్యాప్తంగా దుర్గాదేవీ నవరాత్రులు బుధవారం పరిసమాప్తమయ్యాయి. భక్తులు అమ్మవారి నిమజ్జనం చేశారు. వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారిని శావపై ఊరేగించి పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. అలాగే పలు గ్రామాల్లో మండపాల నిర్వాహకులు నిమజ్జనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం చేయాల్సిన నిమజ్జనాన్ని భక్తులు బుధవారానికి వాయిదా వేసుకున్నారు. ఆలయ ఈవో సత్యనారాయణ, మండపాలు నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

### చిన్నగూడూరులో..

చిన్నగూడూరు : మండల కేంద్రంలో దుర్గామాతకు ప్రత్యేక పూజల అనంతరం కోలాటంతో ఊరేగించారు. అనంతరం నిర్వాహకులు దుర్గామాతను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఈశ్వర్రావ్, శివయ్య, గ్రామస్తులు వీరనారాయణ తదితరులు ఉన్నారు.

### ఇనుగుర్తిలో..

ఇనుగుర్తి : మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో హుస్సేన్ తన తండ్రి అబ్బాస్ అలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమాతా నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కేరళ కళాకారులతో కోలాటం, నృత్యంతో శోభాయాత్ర నిర్వహించారు. వేడుకల్లో గాయత్రి గ్రూప్ ఆఫ్ అధినేత వద్దిరాజు కిషన్, పరిపాటి రాజేందర్‌రెడ్డి, గడ్డం శ్రీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

### గార్లలో..

గార్ల : మండల కేంద్రంలో బుధవారం దుర్గాదేవి నిమజ్జనం ర్యాలీ భక్తులు ఘనంగా నిర్వహించారు. మర్రిగూడెంలో కేరళ నుంచి ప్రత్యేక కళాకారులతో నిమజ్జనం ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో భక్తులు కాంతారావు, రామ్ సింగ్, సైదులు, కిశోర్, శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

### డోర్నకల్‌లో..

డోర్నకల్ : మండల కేంద్రంతో పాటు చిల్కోడు, గొల్లచర్ల, పెరుమాండ్ల సంకీస గ్రామాల్లో బుధవారం కనుల పండువగా దుర్గాదేవి శోభాయాత్ర నిర్వహించారు. పుర వీధుల్లో అమ్మవారికి భక్తుల హారతులు సమర్పించారు. డీజే చప్పుళ్లతో భక్తులు, భవానీలు, నృత్యం అమ్మవారి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.



డోర్నకల్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



కురవి: నిమజ్జన ర్యాలీ తీస్తున్న మహిళలు

# ఫ్లయింగ్ స్క్వాడ్‌తో కాంగ్రెస్ నేతల వాగ్వాదం

- ఎన్నికల అధికారుల విధులకు అడ్డుపడిన వైనం
- మల్లికుదుర్లలో కాంగ్రెస్ అభ్యర్థి ఇందిర ఎన్నికల ప్రచారంలో రభస

వేలేరు, అక్టోబర్ 25 : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిర తరపున ఎన్నికల ప్రచారం చేస్తున్న నేతలు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్ల, గుండ్లసాగర్ గ్రామాల్లో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ అనే నినాదంతో ప్రచారం నిర్వహిస్తూ మహిళలకు పసుపు, కుంకుమ, గాజులతో పాటు జాకెట్(రవిక) ముక్కను కవర్‌లో పెట్టి పంపిణీ చేశారు. కాగా, ప్రచారాన్ని గమనిస్తున్న ఎన్నికల అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది పంపిణీని అడ్డుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో బహుమతులు లాంటివి పంపిణీ చేయొద్దని ప్యాకెట్లను సీజ్ చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల అధికారుల వాహనానికి అడ్డుగా నిలిచి వారి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో మల్లికుదుర్లలో ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం ఏర్పడింది. కాగా, ఘటనా స్థలానికి వేలేరు ఎస్సై డీ హరిత చేరుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులను, అడ్డు తొలగించి సీజ్ చేసిన పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్ ప్యాకెట్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

# రేపు వేట వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు షురూ

### తరలి రానున్న భక్తులు

గార్ల, అక్టోబర్ 25 : ఈ నెల 27 నుంచి నవంబర్ 9 వరకు వేట వెంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభ కానున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రామాయణం మధుస్వామి తెలిపారు. 27న విశ్వక్సేన ఆరాధన 28న ధ్వజారోహణం, 29న హోమ బలిహరణం, 30న గరుడ వాహన సేవ, 31 తెప్పోత్సవం,1న అశ్వవాహన సేవ, 2న పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. గార్లలోని వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లి మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి దేవాలయంలోకి చేర్చుతారు.

### మల్లం వంశీయులతో విగ్రహ ప్రతిష్ఠాపన

డోర్నకల్ మండలానికి చెందిన మల్లం వంశీయులు తమ తోటలో దొరికిన స్వామి వారి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చి మర్రిగూడెం ఆలయంలో ప్రతిష్ఠించారు. దీంతో నాటి నుంచి స్వామి కల్యాణానికి వారు తలంబ్రాలు , పట్టు వస్త్రాలు తీసుక రావడం ఆనవాయితీ. ఈ వేడుకకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు తరలి వస్తారు. పసుపు, కుంకుమ సమర్పించి, భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటారు.





కల్యాణానికి ముస్తాబైన వేట వేంకటేశ్వరస్వామి ఆలయం, స్వామి వారు